ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 26.0

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

బుధవారం 23 ఏప్రిల్ 2025


కదిరి పట్టణంలో నెలరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నిసా, వైస్ చైర్మన్లు కొమ్ము గంగాదేవి, రాజశేఖర్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానంపై ఎన్నిక జరగనుంది. వైసీపీలో మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ నజీమున్నీసా నాయకత్వం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండడం వల్ల అవిశ్వాస తీర్మానం అనివార్యమయింది. గత రెండు సంవత్సరాలుగా వైసీపీ అధిష్టానానికి తమ గోడు చెప్పుకున్నా పెడచెవిన పెట్టడంతో అవిశ్వాసం ప్రకటించక తప్పలేదని కౌన్సిలర్లు చెబుతున్నారు. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశానికి కోరమే ముఖ్యం. ఇప్పటికే తెలుగుదేశం కౌన్సిలర్లతో పాటు మరో 13 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్‌కు మద్దతుగా 11 మంది మాత్రమే మిగిలే అవకాశం ఉంది. అవిశ్వాసంలో చైర్‌పర్సన్ నెగ్గుతారా లేక ఓడిపోతారా అన్న ఉత్కంఠకు నేటితో తెర పడనున్నది.

అవిశ్వాసం నెగ్గేనా..?

కదిరి మున్సిపల్ కార్యాలయం, చైర్‌పర్సన్ నజీమున్నిసా







ఆంధ్రజ్యోతి, కదిరి

కదిరి మున్సిపల్ కౌన్సిల్‌లో 36 మంది కౌన్సిలర్లు ఉండగా.. వైసీపీకి 30 మంది, టీడీపీకి ఐదుగురు, ఇండిపెండెంట్ ఒకరు ఉన్నారు. ఎన్నికలకు ముందు ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లతో పాటు ఇండిపెండెంట్ కౌన్సిలర్ కూడా టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 12కు పెరిగింది. మిగిలిన 24 మందిలో ఇటీవలే 13మంది వైసీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై తిరుగుబాటు బావుటా ఎగుర వేశారు. దీంతో టీడీపీకి 12తో పాటు వైసీపీకి చెందిన 13 మంది చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌ను వ్యతిరేకించే వారి సంఖ్య 25కు చేరింది. చైర్ పర్సన్ వర్గంలో 11 మంది మాత్రమే మిగిలారు. సంఖ్యాపరంగా చూస్తే.. అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉందని పలువురు సీనియర్ కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు. చైర్‌పర్సన్ వ్యతిరేక శిబిరంలో ఇప్పటికే 25 మంది ఉండగా, మరో నలుగురు కౌన్సిలర్లు కూడా అవిశ్వాసానికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

కోరమే కీలకం

మున్సిపల్ సమావేశం జరగాలంటే కోరమే కీలకం. 36 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో 25 మంది సభ్యులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలి. ఇప్పటికే చైర్ పర్సన్ వ్యతిరేక వర్గంలో 25 మంది ఉన్నారు. వీరందరు నేరుగా సమావేశానికి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. చైర్ పర్సన్‌ను దింపడమే తమ సింగిల్ పాయింట్ అజెండాగా చెబుతున్నారు. ఒకవేళ ఒక సభ్యుడు తక్కువ వచ్చినా.. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరు అవుతారు కాబట్టి లెక్క సరిపోతుందనే ధీమాతో ఉన్నారు. కోరం తరువాత.. సమావేశానికి హాజరయిన వారిలో సగం కంటే ఎక్కువ ఎవరికి ఓట్లు వస్తాయో వారు నెగ్గినట్లు అధికారులు ప్రకటిస్తారు.

పనిచేయని వైసీపీ మంత్రాంగం

చైర్‌పర్సన్‌పై తిరుగుబాటు చేసిన వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవడానికి వైసీపీ చేసిన మంత్రాంగం పనిచేయలేదని తెలుస్తోంది. బంధువులు, స్నేహితులుగా ఉన్న వారిని తమ వైపు తిప్పుకోవడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. బంధుత్వం సెంటిమెంట్‌తో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని వైసీపీ కౌన్సిలర్లే చెబుతున్నారు. చివరికి వైసీపీ అధిష్టానం నుంచి ఫోన్ చేయించినట్లు తెలిసింది. దాన్ని కూడా కౌన్సిలర్లు లెక్క చేయక పోవడంతో డబ్బుతో ప్రలోభపెట్టినట్లు సమాచారం. వారి ఒత్తిళ్లు భరించలేక కొంతమంది కౌన్సిలర్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు తెలిసింది.

ఏర్పాట్లు పూర్తి

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసతీర్మాన సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆర్డీఓ వీవీఎస్ శర్మ సమావేశానికి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. కౌన్సిలర్లు, ఐదుగురు మున్సిపల్ ఉద్యోగులను మాత్రమే కౌన్సిల్‌లోకి అనుమతిస్తాం. మీడియా కోసం బయట ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఆరోగ్య సమాజమే లక్ష్యం

- పోషణ్ అభియాన్‌తో పౌష్టికాహారం
- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన పిల్లలతో, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే పోషణ్ అభియాన్ పథకం లక్ష్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహారం పక్షోత్సవాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు, గర్భవతులు, మహిళల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం కోసం కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఉచితంగా అందిస్తామని అన్నారు. ప్రతి మహిళ గర్భస్థ దశ నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు పిల్లలకు కలెక్టర్ అన్నప్రాసన చేశారు. గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ రూపొందించిన ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం, డీఈఓ క్రిష్టప్ప, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుధీష్ వర్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్‌లో కదిరివాసి ప్రతిభ

జాతీయ స్థాయిలో 918 ర్యాంకు

సాయిషణ్ముఖకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు



కదిరి అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో కదిరి వాసి ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన విశ్రాంత ఏఎస్ఐ నరసింహులు, నరసమ్మ దంపతుల కుమారుడు సాయిషణ్ముఖ జాతీయ స్థాయిలో 918 ర్యాంక్ సాధించారు. ఆయన ఆరు నుంచి పదో తరగతి వరకు మదనపల్లిలోని సత్యసాయి పాఠశాలలో చదివారు. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్యలో, ఇంజనీరింగ్ మదనపల్లిలోని మిట్స్ కళాశాలలో చదివారు. తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఆయనను అభినందించారు.

ఆర్‌జే రత్నాకర్‌ను కలిసిన బీసీసంక్షేమ శాఖ మంత్రి సవిత



సాయిబాబా సేవలు మరువలేనివి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా మానవాళికి చేసిన సేవలు వెలకట్టలేనివని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను పుట్టపర్తిలో మంగళవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బులగుండ్ల శ్రీనివాసులు, ఎల్ఐసీ బాబు, కురుబ సంఘం నాయకులు కేశాని ఆదినారాయణ మంత్రిని కలిసి సత్యసాయి బాబా చిత్రపటాన్ని బహూకరించారు.

థ్యాంక్యూ సీఎం సార్..

పోస్టర్లను ప్రదర్శిస్తున్న మంత్రి, పాస్టర్లు



పెనుకొండ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పాస్టర్ల గౌరవ వేతనానికి రూ.30కోట్ల నిధుల విడుదలపై ఆ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితతో కలిసి పాస్టర్లు స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. 'థ్యాంక్యూ సీఎం సార్..' పోస్టర్లను ప్రదర్శించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లిస్తామంటూ నారా లోకేశ్ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చి చూపించామన్నారు. కొత్త పాస్టర్లకు కూడా త్వరలో గౌరవవేతనం అందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, పాస్టర్లు పాల్గొన్నారు.

పాడెక్కే వయసులో..పాడు పనులు

చిన్నారులపై వృద్ధుల అఘాయిత్యాలు

తెలిసిన వారే కాటేస్తున్న వైనం

వెలుగు చూస్తున్న ఘటనలే నిదర్శనం

పోలీసులను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు

- గత ఏడాది హిందూపురం మండలం తూమకుంట వద్ద వరుసకు తాతయ్య అయిన వ్యక్తి.. బాలికను తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తరువాత హత్య చేసి పూడ్చిపెట్టాడు.
- గతేడాది పరిగి మండలంలో 60 ఏళ్ల వృద్ధుడు వరుసకు మనవరాలైన చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి, పోలీసుల ద్వారా ఆ వృద్ధుడిని కటకటాల వెనక్కి పంపారు.
- హిందూపురం పట్టణంలోని పులమతి రోడ్డులో చిల్లర దుకాణం నిర్వహించే 60 ఏళ్లు పైబడిన వృద్ధుడు దుకాణానికి వచ్చే వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. తాకరానిచోట ఉద్దేశపూర్వకంగా తాకేవాడు. తొలుత మందలించి వదిలేశారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈక్రమంలోనే ఓ ప్రైవేట్ ఉద్యోగి కుమార్తె పట్ల ఇలాగే వ్యవహరించాడు. దీంతో ఆయన చిల్లర దుకాణం వద్దకు వెళ్లి గట్టిగా నిలదీశాడు. అంతకు ముందు బాధితులు కూడా వచ్చి మందలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేశారు.
- గత శనివారం చిలమత్తూరు మండలంలో ఎనిమిదేళ్లలోపు ఉన్న చిన్నారిపై 70ఏళ్లు పైబడిన వృద్ధుడు అఘాయిత్యానికి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేసి తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఇవి బయటకు వచ్చినవి మాత్రమే.. చాలామంది చిన్నారులు ఇలాంటి అనుభవాలను ఎదుర్కొన్నా, తప్పుచేసినవారు బంధువులు, స్నేహితులు కావడంతో బయటికి చెప్పుకోలేక లోలోపలే మథన పడుతున్నారు.

హిందూపురం పట్టణం



ఇటీవల కాలంలో సమాజంలో కొందరు పెడబుద్ధితో పాడు పనులు చేయడం పెరిగిపోయింది. అయినవారే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మాయ మాటలతో చిన్నారుల జీవితాలను చిదిమేస్తున్నారు. దీంతో చేదు జ్ఞాపకాల భారంతో ఆ చిన్నారులు భవిష్యత్తులోకి భయం భయంగా అడుగిడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం



తెలిసినవారే..!

చిన్నారులు, మహిళలపట్ల లైంగిక దాడులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా కామాంధుల తీరు మాత్రం మారడంలేదు. చిన్నా, పెద్ద వావి వరుసలు మరిచి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అయినవారే, తెలిసినవారే కాటేస్తుంటే వారికి భద్రత ఎవరిస్తారు. ఇలాంటివి జిల్లాలో తరచూ ఏదో ఒక మూల జరుగుతూనే ఉన్నాయి. కంటికి రెప్పలా కాపాడాల్సినవారే పసిపిల్లలను కాటేస్తున్నారు. కొంతమంది తినుబండారాలు ఆశ చూపి, కొంతమంది బెదిరించి ఇలాంటి వాటికి పాల్పడుతున్నారు.

పోలీసులను ఆశ్రయిస్తున్నారు

ఇటీవల చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో బాలికల తల్లిదండ్రులు తమ పిల్లలకు జరిగిన అన్యాయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇందులో వందలో ఒకరిద్దరు మాత్రమే పోలీసుల ముందు జరిగిన ఘటనను చెప్పి కేసు నమోదు చేయాలని కోరుతున్నారు. కానీ చాలా మంది తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయిస్తే కేసులు నమోదు చేస్తారు. పరువు పోతుందని భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. అయితే ఇలాంటి ఘటనలపై పోలీసులు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులు కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరుస్తున్నారు. ఇటీవల పోక్సో కేసుల్లో పలువురికి శిక్షలు కూడా పడ్డాయి. చిన్నారులు, బాలికలపట్ల అఘాయిత్యం జరిగితే పోలీసులను ఆశ్రయించి జరిగిన అన్యాయాన్ని తల్లిదండ్రులు ధైర్యంగా చెప్పాల్సిన అవసరం ఉంది.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ఎవరైనా చిన్నారులు, బాలికల పట్ల, పేద మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా అఘాయిత్యాలకు పాల్పడిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. కొంతమంది తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి మొహమాటపడుతున్నారు. అలాంటి ఇబ్బంది పడకుండా నిర్భయంగా వచ్చి ఫిర్యాదు చేస్తే మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. అఘాయిత్యానికి పాల్పడిన వారికి కఠినంగా శిక్ష పడేలా చూస్తాం. ఇప్పటికే కొంతమంది నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి, శిక్ష పడేలా చేశాం.



-మహేష్, డీఎస్పీ



ఆహుతవుతున్న తూపల్లి గొడుగుకొండ

కొండల్లోని గడ్డి ఆహుతి

గాండ్లపెంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలపై ఉన్న ఎండు గడ్డి ఆహుతైంది. వర్షాకాలంలో మండలంలోని కొండలపై గడ్డి ఏపుగా పెరిగింది. రెండు నెలలుగా ఎండలకు ఆ గడ్డి ఎండింది. సోమవారం రాత్రి కొందరు ఆకతాయిలు దానికి నిప్పు పెట్టడంతో ఆ మంటలు అన్ని కొండలకు వ్యాపించాయి. తూపల్లి గొడుగుకొండ, కదిరి మండలంలోని బూరుగుపల్లి వద్ద ఉన్న కొండల్లోని గడ్డి, చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వన్యప్రాణులు కూడా సజీవ దహనం అయి ఉంటాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండల్లో మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది ఏ మాత్రం చొరవ చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైలు దొంగల సవాల్ 6

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చక్రవర్తి, ఆర్‌జే రత్నాకర్



రేపు సత్యసాయి ఆరాధన

వివరాలు 7లో

దొంగలున్నారు జాగ్రత్త

వేసవిలో అప్రమత్తంగా లేకుంటే దోచేస్తారు..

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కరువు

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే దొంగలకు కూడా సీజన్ ప్రారంభమైనట్టే. సెలవుల్లో అనేక మంది సొంతూర్లకు, షికార్లకు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ఈ క్రమంలో అప్రమత్తంగా లేకుంటే ఇదే అవకాశంగా దొంగలు ఇళ్లను దోచేస్తారు. రాత్రిళ్లు ప్రజలు ఆరుబయట, మిద్దెలపై నిద్రిస్తున్న సమయంలోనూ, ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళ్తున్నపుడు గమనించి దొంగలు పని కానిచేస్తున్నారు. నియోజకవర్గంలో వేసవిలో చోరీలు అధికంగా జరుగుతుండడం ప్రజల కంటిపై కునుకులేకుండా చేస్తోంది.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన ఏదీ?

చోరీల కట్టడికి పోలీసు శాఖ కొన్నేళ్ల క్రితమే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్)ను అమలులోకి తెచ్చింది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను సైతం రూపొందించింది. ఊర్లకు వెళ్లేవారు ఈ యాప్ ద్వారా ఇంట్లో దొంగలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన, ఏ సమయానికి ఊరు వెళ్తున్నారు, ఎప్పుడు తిరిగి వస్తారు... తదితర వివరాలను యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడి సిబ్బంది.. ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేవారు కరువయ్యారు. కొంతమందికి అవగాహన ఉన్నా.. వినియోగించుకోవడానికి ఆసక్తి చూపట్లేదు. వెరసి, చోరీలకు అవకాశం కల్పిస్తున్నారు. ఊర్లకు, విహార యాత్రలకు వెళ్లే విషయాలను ఇతరులతో పంచుకోవద్దనీ, మరీ ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో అస్సలు పోస్టు చేయవద్దని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా.. ప్రజలు ఖాతరు చేయట్లేదు. ఊర్లు, విహార యాత్రలకు వెళ్తున్న సమాచారం, అక్కడ తీసుకున్న ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇది దొంగలకు చాన్స్ ఇచ్చే పనేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

LHMS AP Police

Click to Download LHMS AP Police App

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



వేసవిలో చోరీలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ప్రజలకు తెలియజేస్తాం. వేసవి సెలవుల్లో సొంతూర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలి.

- హేమంత్‌కుమార్, డీఎస్పీ, ధర్మవరం

జాగ్రత్తలు తప్పనిసరి..

- వేసవిలో మహిళలు బంగారు, వెండి ఆభరణాలు ధరించి, ఇంటి బయటకానీ, మిద్దెపై కానీ నిద్రించవద్దు.
- ఇంట్లో పడుకున్నపుడు లోపల డోర్‌లాక్ చేసుకోవడం మరచిపోరాదు.
- ఇంట్లో వారంతా ఊరు వెళ్లవలసి వస్తే, విలువైన బంగారు, వెండి అభరణాలు, నగదును బ్యాంకు లాకరులో భద్రపరచాలి. లేదంటే వెంట తీసుకెళ్లాలి.


బయట ఊర్లకు వెళ్లేటపుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఏర్పాటుచేసి, చోరీలు జరగకుండా పర్యవేక్షిస్తారు.

- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112 నంబరుకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలి.
- ఊర్లకు, విహార యాత్రలకు వెళ్లే సమాచారం ఇతరులతో పంచుకోరాదు. సోషల్ మీడియాలో అస్సలు పోస్ట్ చేయరాదు.

బోగస్‌లలో గుబులు

● టీచర్ల బదిలీలకు సిద్ధమైన విద్యాశాఖ ● గతంలో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో అడ్డగోలు లబ్ధి





- కుప్పలుతెప్పలుగా వినికిడి లోపం సర్టిఫికెట్లు
- టిస్ సమాచారం మేరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 627 మంది..
- వాటి స్క్రూటినీ, కొత్తవి మంజూరుకు రేపట్నుంచి మెడికల్ క్యాంపులు
- అయ్యవార్లలో టెన్షన్

అనంతపురం విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు కొత్త గుబులు పట్టుకుంది. టీచర్ల బదిలీల కోసం ఇప్పటికే ప్రభుత్వం తొలిసారి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీల యాక్ట్-2025 తీసుకొచ్చింది. ఈ క్రమంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద అదనపు పాయింట్లు పొందిన టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధమైంది. మూడు రోజులపాటు మెడికల్ క్యాంపులు నిర్వహించి పాత వాటిని స్క్రూటినీ చేసి.. కొత్త వాటిని ఇవ్వనున్నారు. దీంతో టీచర్లకు కొత్త పరీక్షలు గుబులు పుట్టిస్తున్నాయి. చాలామంది టీచర్లు లేని చెవుడు ఉన్నట్టు, రాని రోగాలు కూడా వచ్చినట్లు, తమ పిల్లలు, తల్లిదండ్రులు డిపెండెంట్స్ అంటూ బోగస్ సర్టిఫికెట్లు పొందారు. వాటి ద్వారా స్పెషల్ పాయింట్లు పొంది బదిలీల్లో లబ్ధి పొందారు. తీరా ఈనెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజలపాటు వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పునఃపరిశీలన ఉండటంతో అక్రమార్కులు కళ్లు తేలేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు 627 మంది ఉన్నట్లు స్వయానా వారే ప్రకటించుకున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో నమోదు చేసుకున్నారు. అవి సుమారు 1,000 వరకూ ఉంటాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా టీచర్లలో కొత్త పరీక్షల టెన్షన్ మొదలైంది.

రేపట్నుంచి క్యాంపులు..

ఇప్పటికే సర్టిఫికెట్లు ఉన్న టీచర్లు ఇప్పుడు 24వ తేదీ నుంచి 3 రోజులపాటు నిర్వహించే వైద్య శిబిరాల్లో వాటిని వెరిఫికేషన్ చేసుంచుకోవాలి. డాక్టర్లు.. టీచర్ల పాత సర్టిఫికెట్లు పరిశీలించడంతోపాటు, వారి డిపెండెంట్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య పరీక్షల్లో తప్పని తేలితే... రిజక్ట్ చేస్తారు. ఈ మెడికల్ క్యాంపు ల్లో జారీచేసిన కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో టీచర్లకు ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.



గతంలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

చాలామంది బోగస్ బాట...

గతంలో చాలామంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టారు. చెవుడు లేకున్నా...ఉన్నట్టు, పిల్లలు, తల్లిదండ్రులకు సైతం లేని మానసిక జబ్బులు ఉన్నట్టుగా కూడా చూపి స్పెషల్ పాయింట్లు పొందడంతోపాటు, ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద లబ్ధి పొందారు. కొందరు టీచర్లు నియామకాల్లో సైతం ఇదే పార్ములా ఉపయోగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. 1994 డీఎస్సీలో కొందరు అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందారని సమాచారం. ఎవరూ గుర్తించకపోవడంతో 1996, 1998 డీఎస్సీల సమయంలో కుప్పలుతెప్పలుగా అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు చూపించి, ఉద్యోగాల్లో చేరారు. తర్వాత కాలంలో ఉపాధ్యాయుల బదిలీల్లోనూ ఇదే కొనసాగించారని సమాచారం. అంతేకాకుండా తమ పిల్లలు, తల్లిదండ్రులు సైతం డిపెండెంట్స్ అంటూ సర్టిఫికెట్లు చూపి లబ్ధి పొందారు. ఇలాంటివారు చాలామందే ఉన్నారు. మూడేళ్ల కిందట బుక్కరాయసముద్రం మండంలోని ఒక స్కూల్‌లో పనిచేసిన హెచ్ఎం తనకు 80 శాతం అంగవైకల్యం ఉందంటూ సర్టిఫికెట్ పెట్టి బదిలీల్లో లబ్ధి పొందారు. ఆమె నిత్యం కారులో స్కూల్‌కు వచ్చేవారని తోటి టీచర్లే చెబుతారు. 80 శాతం అంగవైకల్యం ఉన్న ఆమె కారు డ్రైవ్ చేస్తూ.. స్కూల్‌కు ఎలా వస్తారన్నది వింటుంటే.. ఏ స్థాయిలో బోగస్ సర్టిఫికెట్ సృష్టించారో ఇట్టే అర్థమవుతోంది. మరికొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం చెవుడు ఉందని చెప్పి సర్టిఫికెట్లు చూపించి బదిలీల్లో లబ్ధి పొందుతున్నారు. ఇంకా కొందరు టీచర్లు చిన్నపాటి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఘటనలను చూపి దివ్యాంగులుగా చిత్రీకరించి... లబ్ధిపొందారు. కొందరు టీచర్లు.. వైద్యులకు రూ.30 వేలు, రూ.50 వేలు లంచాలు ఇచ్చుకుని, దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందారు కూడా. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... చాలా మంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టి... అడ్డదారులు తొక్కి అర్హుల అవకాశాలకు గండి కొట్టారు.

పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారికంగా ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటగిరీ టీచర్లు 672 మంది ఉన్నట్లు టిస్ ద్వారా తెలుస్తోంది. వాస్తవానికి 1000 మంది వరకూ టీచర్లు ఉంటారని జిల్లా విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. టిస్ రిపోర్ట్ మేరకు 627 మంది మాత్రమే ఉంటే.. మిగిలిన వారు దొడ్డిదారిలో వచ్చిన వారైనా ఉండాలి, లేదంటే టిస్‌లో అప్‌డేట్ చేయనివారైనా ఉండాలి. ఉద్దేశపూర్వకంగానైనా టిస్‌లో అప్‌లోడ్ చేయని వారైనా ఉండాలి. స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తే... బోగస్ సర్టిఫికెట్ల బాగోతం బయటపడుతుందనడంతో సందేహం లేదు. డాక్టర్లకు మామూళ్లు ఇచ్చి సర్టిఫికెట్లు చేయించుకున్నోళ్లు చాలామందే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో వాళ్లు ఇచ్చిన సర్టిఫికెట్లు అదే డాక్టర్ల చేతికి చేరితే... మళ్లీ అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెడితే... అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉంటుంది. ఇతర జిల్లాల డాక్టర్లనైనా నియమించాలి, విద్యాశాఖ, వైద్యశాఖల సమన్వయంతో పారదర్శకంగానైనా పరీక్షలు నిర్వహించాలి. అప్పుడే అక్రమార్కులు బయటపడే అవకాశం ఉంది.

అర్హతలు ఇవీ..

- శారీరక వైకల్యం 40 శాతం నుంచి 70 శాతం అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్, హియరింగ్ ఇంపెయిర్డ్ ఉద్యోగులకు స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.
- శారీరక వైకల్యం 80 శాతం, అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో స్పెషల్ పాయింట్లు వర్తిస్తాయి.
- మెడికల్ గ్రౌండ్స్ కింద క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ/ఆట్రియల్ సెప్టెల్ డిఫెక్ట్/అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, ఎముకల టీబీ, కిడ్నీల మార్పిడి/డయాలసిస్, స్పైనల్ సర్జరీ, మానసిక జబ్బులతో బాధపడే పిల్లలుగానీ, భార్యగానీ ఉండి ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతోపాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- జువైనల్ డయాబెటిస్, థలసీమియా, హీమోఫీలియా, మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధులతో బాధపడే పిల్లలు.. ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతో పాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- హృదయ రంధ్రాల లోపంతో జన్మించిన పిల్లలకు ఆపరేషన్ చేసిన తేదీ నుంచి 3 ఏళ్లలోపు ఉండాలి (ఇలాంటి పిల్లలున్న ఉద్యోగికి).

జై జవాన్ జై కిసాన్



వ్యవసాయంలో రాణిస్తున్న మాజీ సైనికుడు

సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు

మంచి దిగుబడులతో ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

అతడిదో సాధారణ రైతు కుటుంబం. చదువుకుంటూనే పొలం పనుల్లో తల్లిదండ్రులకు తోడు ఉండేవాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో ఆర్మీకి ఎంపికయ్యాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 17 ఏళ్ల పాటు సేవలందించి రిటైర్డ్ అయ్యాడు. అనంతరం స్వగ్రామానికి చేరుకుని తనకు ఎంతో ఇష్టమైన సేద్యంలోకి దిగాడు. సేంద్రియ పద్ధతులతో వివిధ రకాలు పంటలు సాగు చేసి, మంచి దిగుబడులతో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఆయనే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ సైనికుడు శ్రీనివాస్‌రెడ్డి.





సాగు చేసిన చీనీ, మిరప పంటను చూపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కుటుంబ నేపథ్యం

శ్రీనివాస్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. తల్లి ఆదిలక్ష్మి, తండ్రి కృష్ణారెడ్డి నిత్యం పొలం పనులు చేస్తుండేవారు.వీరికి సాయంగా చిన్నకుమారుడైన శ్రీనివాస్‌రెడ్డి సెలవు రోజుల్లో పనులకు వెళ్లేవాడు. అలా వ్యవసాయం మీద మోజు ఏర్పడింది. అయితే తల్లిదండ్రులు మాత్రం సేద్యం వద్దని, బాగా చదువుకుని ఉద్యోగం తెచ్చుకోమని చెబుతుండేవారు. ఈక్రమంలోనే 2001లో పదో తరగతి పూర్తి చేసి ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో ఆర్మీకి సెలక్ట్ అయ్యాడు. శిక్షణ అనంతరం శ్రీనగర్, జమ్మూకశ్మీర్ వంటి వివిధ ప్రాంతాల్లో పని చేశాడు. ఆర్మీలో పని చేసే సమయంలోనే వివాహం చేసుకున్నాడు. ఈయనకు ఇద్దరు సంతానం ఉన్నారు.

జవాన్ నుంచి కిసాన్‌గా...

2019లో జవాన్‌గా రిటైర్డ్ అయిన శ్రీనివాస్‌రెడ్డి కిసాన్‌గా మారాడు. ఆర్మీ నుంచి ఇంటికొచ్చాక తమ కుటుంబానికి ఉన్న 15 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చాడు. ఇందులో చీనీ, వేరుశనగ, వరి, మిరప, టమోటా వంటి పంటలు పండిస్తున్నాడు. ఆరు బోరు బావుల ద్వారా డ్రిప్పులు, స్ప్రింక్లర్ల సాయంతో పంటలకు నీటి తడులు అందిస్తున్నాడు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాడు. కనగానపల్లిలో లైన్‌మన్‌గా పని చేస్తున్న తన అన్న రాజశేఖర్‌రెడ్డి కూడా సేద్యంలో సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన పలు ప్రైవేటు సంస్థల్లో సెక్యూరిటీ గార్డుగా అవకాశం వచ్చింది. అయితే అక్కడ విధులు నచ్చక చేరలేదు. కొన్నాళ్లపాటు ఇసుక రీచ్‌లో ఎస్‌పీఎస్‌ఓగా పని చేశాడు. వారి విధులు తొలగించడంతో తనకు ఇష్టమైన వ్యవసాయం వైపు మళ్లాడు. కుటుంబ సభ్యులు సహకారంతో సీజన్‌కు అనుగుణంగా పంటలు పండిస్తూ మంచి లాభాలు గడిస్తున్నాడు. దేశానికి ఆర్మీ జవానుగా సేవ తనకు గర్వంగా ఉందని, ప్రస్తుతం వ్యవసాయం తనకూ తన కుటుంబానికి తోడుగా ఉండటం ఆనందంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-కనగానపల్లి)



రైలు దొంగల సవాల్





గుంతకల్లు ఔటర్‌లో నిలిచిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

కొత్త ప్లాన్లతో విరుచుకుపడుతున్న వైనం

జీఆర్పీకి తలనొప్పిగా మారిన కట్టడి

వేసవి వచ్చిందంటే రైళ్లలో రద్దీ విపరీతంగా పెరుగుతుంది. దొంగలు సైతం ప్రతాపం చూపుతారు. ప్రతిసారీ కొత్త కొత్త ప్లాన్లతో ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ)లకు దొంగలు సవాల్ విసురుతున్నారు. జీఆర్పీ సిబ్బంది దొంగల పాత ప్లాన్‌ను ఛేదించలోపే.. కొత్త పథకంతో విరుచుకుపడుతున్నారు. దీంతో వేసవి వచ్చిందంటే రైళ్లలో చోరీలు, దోపిడీలను అడ్డుకోవడం సవాల్‌గా మారుతోంది. శ్రీసత్యసాయి, నెల్లూరు జిల్లాలో రైళ్లలో కొన్ని రోజుల క్రితం దోపిడీలు చేశారు. వేసవిలో నెల రోజులు ప్రశాంతంగా గడచిపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) శాఖ వరుసగా రెండు రైలు దోపిడీలతో షాక్‌కు లోనైంది. రైళ్లలో గస్తీ ముమ్మరం చేసింది. సిబ్బంది కొరత నేపథ్యంలో జీఆర్పీ, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) శాఖలు.. సివిల్ పోలీసులతో కలిసి గస్తీ నిర్వహిస్తున్నాయి. వేసవి పూర్తయ్యే వరకూ ప్రయాణికులు కూడా జాగ్రత్తలు పాటించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలు ఎప్పటికప్పుడు కొత్త ప్లాన్లు వేస్తున్నాయి. తొలుత జనరల్, స్లీపర్ క్లాస్ ప్రయాణికుల్లా వచ్చి చైన్‌లాగి దోపిడీలు చేసేవారు. ఏడేళ్ల కిందట రైళ్లపైకి రాళ్లు రువ్వి, ప్రయాణికులను భయభ్రాంతులకు లోనుచేసి దోచుకెళ్లారు. ఐదేళ్లుగా ప్రధాన రైల్వే స్టేషన్ల ఔటర్లలో సిగ్నల్‌ను టాంపరింగ్ చేయడం, రైలు నిలిచే చిన్న స్టేషన్లపై కన్నేసి ప్రయాణికులను దోచుకున్నారు. ఇప్పుడు తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సుదూర ప్రాంతాలకు వెళ్లే దురంతో ఎక్స్‌ప్రెస్‌లను టార్గెట్‌గా చేసుకుని, సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికుల సొమ్ము దోచారు. ఈ ఏడాది మార్చి 29న శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి సమీపాన షిర్డీ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లోకి చొరబడిన దుండగులు.. ప్రయాణికుల మెడల్లోని నెక్లెస్‌లను లాక్కెళ్లారు. ఆ తర్వాత నాలుగు రోజులకే నెల్లూరు జిల్లాలో చండీఘర్-మధురై ఎక్స్‌ప్రెస్‌ను సిగ్నల్ టాంపరింగ్ ద్వారా నిలిపివేసిన దుండగులు ప్రయాణికులను దోచుకున్నారు. మహిళల మెడలోని నగలను లాక్కున్నారు. ఈ రైలు కంటే ముందుగా వచ్చిన హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ దుండగుల బారి నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ మూడు రైళ్లు దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కావడం, ప్రధాన స్టేషన్లకు దూరంగా వాటిని నిలిపి దోపిడీలకు పాల్పడడం యాదృచ్ఛికం కాదు. ఇలా.. తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సూపర్ ఫాస్ట్ దురంతో ఎక్స్‌ప్రెస్‌లను ఈసారి దొంగలు టార్గెట్ చేశారు.

దొంగల ముఠాలివే..

మహారాష్ట్రకు చెందిన ప్రధి గ్యాంగ్ 2022 సంవత్సరంలో గుత్తి ఔటర్‌లో సిగ్నల్ టాంపరింగ్ చేసి, ప్రయాణికుల బంగారు ఆభరణాలను లాక్కెళ్లింది. అదే సంవత్సరం నెల్లూరు వద్ద సోలాపూర్ గ్యాంగ్.. ప్రయాణికులను దోచుకుంది. 2023లో యూపీకి చెందిన ఉన్నావ్ గ్యాంగ్ గుంతకల్లు వద్ద ప్రయాణికుల బ్యాగ్‌లు, ఆభరణాలు తస్కరించింది. అదే ఏడాది యూపీకి చెందిన గోండా గ్యాంగ్ హిందూపురం వద్ద ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగించి, దోచుకుంది. గత సంవత్సరం కదిరి వద్ద యూపీకే చెందిన మీర్జాపూర్ గ్యాంగ్, అనంతపురం వద్ద గోండా గ్యాంగ్ మత్తుమందుతో రైలు ప్రయాణికులను దోచుకున్నాయి. వీటిపై జీఆర్పీ విచారణ చేపట్టి ప్రధి గ్యాంగ్‌కు చెందిన నలుగురిని, సోలాపూర్ ముఠా సభ్యులు ముగ్గురిని, ఉన్నావ్ గ్యాంగ్‌లో ఇద్దరిని, రెండు కేసుల్లో గోండా గ్యాంగ్ సభ్యులు ఆరుగురిని, మీర్జాపూర్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టుచేసి, రికవరీలు చేశారు.



నేర చరితులపై ప్రత్యేక దృష్టి

గతంలో రైలు దోపిడీలు, బ్యాగుల చోరీలు, మత్తుమందు ప్రయోగాలు జరిగిన ప్రదేశాలపై జీఆర్పీ, ఆర్పీఎఫ్ ప్రత్యేక దృష్టి సారించాయి. గుత్తి-తాడిపత్రి సెక్షన్‌లో దుండగ ముఠాలు సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికులను దోచుకున్నాయి. గుత్తి-తిరుపతి రూటులోని యర్రగుంట్ల-కమలాపురం సెక్షన్‌లో, గుంతకల్లు-వాడి రూటులో ఆదోని-కొప్పల్ సెక్షన్‌లోనూ, గుంతకల్లు-సికింద్రాబాద్ రూటులో డోన్-కర్నూలు సెక్షన్‌లోనూ, విజయవాడ రూటులో డోన్-నంద్యాల సెక్షన్‌లోనూ దొంగల ముఠాలు బోగీలపైకి రాళ్లు రువ్వి, మహిళల ఆభరణాలను లాక్కెళ్లాయి. గుంతకల్లు, రేణిగుంట, తిరుపతి, పెనుకొండ, గుత్తి స్టేషన్ల వద్ద దొంగలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. అనంతపురం-హిందూపురం, ఒంగోలు-చీరాల, తిరుమల-విజయవాడ సెక్షన్లలో ముఠాలు.. ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగాలతో దోచుకున్నాయి. ఈ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు స్టేషన్లలోనూ, రైళ్లలోనూ భద్రతను పెంచాయి.

పరిష్కారం కాని ఔటర్ సమస్య

రైల్వే శాఖ పెద్ద స్టేషన్ల వద్ద ఔటర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేస్తుండడం సమస్యలకు తావిస్తోంది. పెద్ద స్టేషన్లకు సమీపాన దొంగల ముఠాలు సిగ్నల్ వ్యవస్థను దెబ్బతీసి ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఖాళీలేక బయట కటిక చీకట్లో రైళ్లను నిలిపివేస్తుండటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతకల్లు జంక్షన్‌లో ఐదు ప్రధాన రూట్లలో రైలు మార్గాలున్నాయి. సాయంత్రం నుంచి ఉదయందాకా రైళ్లను పదుల సంఖ్యలో ఔటర్లలో నిలిపి వేస్తున్నారు. విజయవాడ రూటులో ఒకేసారి ఏకంగా మూడు రైళ్లను సైతం ఆపేస్తున్నారు. తిరుపతి, రాయచూరు, గుత్తి, ధర్మవరం, తదితర రైల్వే కూడళ్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. ఆయా చోట్ల పోలీసు సిబ్బందిని నియమించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..



దొంగల కదలికలపై గట్టి నిఘా పెట్టాం. చోరీ, దోపిడీ కేసులను ఛేదించాం. రికవరీలు కూడా చేశాం. అయినా.. చోరీలకు ఆస్కారమివ్వకుండా ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వేసవిలో కిటికీలు, తలుపుల వద్ద మహిళలు అప్రమత్తంగా ఉండాలి. విలువైన ఆభరణాలు ధరించి ప్రయాణాలు చేయడం మంచిదికాదు. ఔటర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో కోరాం. సిబ్బంది కొరతను అధిగమించడానికి సివిల్ పోలీసుల సహకారం తీసుకుంటున్నా. **- రాహుల్ మీనా, జీఆర్పీ ఎస్పీ**

అభివృద్ధికి అడుగులు

నెరవేరుతున్న హామీలు

కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం

బీటీపీ భూసేకరణకు నిధులు

చంద్రబాబు ఎన్నికల పర్యటనకు ఏడాది పూర్తి

నిర్మాణ దశలో ఉన్న బాలికల జూనియర్ కళాశాల భవనం



రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు రాయదుర్గం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలోని కణేకల్లులో గత ఏడాది జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఏడాది కాలంలో పలు హామీలను నెరవేరుస్తున్నారు. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని, భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను అందిస్తానని, హంద్రీనీవా 36వ ప్యాకేజీకి మోక్షం కల్పిస్తానని ఇచ్చిన హామీలను ఏడాదిలోనే అమలుకు శ్రీకారం చుట్టారు.

కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం

ఎన్నికల సభలో భాగంగా చంద్రబాబు కణేకల్లులో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. 2025-26 సంవత్సరంలో కళాశాల ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదెకరాల భూసేకరణ కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది కళాశాల ప్రారంభించేందుకు తాత్కాలికంగా ఖాళీ ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. రాయదుర్గం, ఉరవకొండ పట్టణాలకు వెళ్లి డిగ్రీ విద్యాభ్యాసం సాగించే పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు ఆ కష్టాలు తొలగిపోతాయి.



హెచ్చెల్సీలో జరుగుతున్న పనులు

కాలువ భూసేకరణకు రూ.64 కోట్లు

జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు రెండు టీఎంసీల కృష్ణాజలాలను మళ్లించేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 960 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు నాన్చుతూ వచ్చింది. ఐదేళ్లలో పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో కాలువల తవ్వకాల భూసేకరణకు రూ. 64 కోట్లు నిధులను మంజూరు చేసింది. దీంతో పనులు మరింత వేగం అందుకోనున్నాయి. ఏళ్ల తరబడి కృష్ణాజలాల కోసం ఆ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. నిధుల కేటాయింపుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి.

36వ ప్యాకేజీ పనుల్లో కదలిక

హంద్రీనీవా నుంచి సాగునీరు అందించేందుకు 36వ ప్యాకేజీ పనులను పదేళ్ల క్రితం మంజూరు చేశారు. ఇప్పటి వరకు భూసేకరణకు సంబంధించిన పరిహారం ఇవ్వలేదు. ఏడాది క్రితం కణేకల్లు బహిరంగ సభలో చంద్రబాబు ప్రకటించిన విధంగా భూసేకరణలో భూములు కోల్పోయిన రైతాంగానికి పరిహారం సొమ్మును ప్రభుత్వం మంజూరు చేసింది. హంద్రీనీవాలోని 36వ ప్యాకేజీ పనుల్లో కాలువ తవ్వకాలు చేశారు. భూమి కోల్పోయిన రైతులకు ఏళ్లతరబడి పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో పరిహారం అందించడంతో మాట నెరవేర్చుకున్నారని అన్నదాతలు కొనియాడుతున్నారు.

బాలికల జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం

రాయదుర్గంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పెద్ద ఎత్తున చేరుతుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత టీడీపీ హయాంలో బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసి భవనాల కోసం రూ.52 లక్షలు కేటాయించారు. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గుమ్మఘట్టలో బాలికల ఆశ్రమ కళాశాలకు సంబంధించి ఆగిపోయిన పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రూ. 32 కోట్లతో హెచ్చెల్సీకి ఉపశమనం

తుంగభద్ర ఎగువకాలువ ఆధునికీకరణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. అధ్వాన్నస్థితికి చేరుకున్న కాలువను మరమ్మతులు చేయించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే మరమ్మతులకు రూ.32 కోట్లను మంజూరు చేసింది. ఏడాది క్రితం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఆధునికీకరణ పరిశీలనలో ఉన్నప్పటికీ నీటి సరఫరాకు అంతరాయంగా ఉన్న చోట మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో హెచ్చెల్సీకి ఐదేళ్ల వైసీపీ శాపం నుంచి విముక్తి కలిగి ఉపశమనం లభించినట్లయింది.

రేపట్నుంచి మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో.. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్లు


చర్చిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు, మల్లికార్జున రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల కోసం మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జిల్లా సర్వజన వైద్యశాలలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయా తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. 24వ తేదీన అనంతపురం జిల్లా ఉపాధ్యాయులకు 25న శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యాయులు వెరిఫికేషన్ కోసం రావాలని సూచించారు. ఆ రెండు తేదీల్లో రాలేని రెండు జిల్లాల ఉపాధ్యాయులు 26వ తేదీన రావాలని సూచించారు. పాత మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తాజా మెడికల్ రిపోర్టులు, రోగులను తీసుకుని రావాల్సి ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఆస్పత్రిలో ఐదు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డీఈఐసీ లో క్యాన్సర్ బాధితులకు, బర్న్స్ వార్డులో పీడియాట్రిక్స్, సైకియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ బాధితులకు, సైకియాట్రీ వార్డులో సూపర్‌స్పెషాలిటీ స్పెషలిస్టులు, మెడికల్ సంబంధిత బాధితులకు అప్తమాలజీ వార్డులో దృశ్యలోపం ఉన్న వారికి, ఈఎన్‌టీవార్డులో వినికిడి లోపం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏర్పాట్లపై సమీక్ష

జిల్లా ఆస్పత్రిలో శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్, డీఎంఈ నుంచి ఆస్పత్రికి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి మంగళవారం సమావేశమై ఈ అంశం గురించి చర్చించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత, వైద్య సిబ్బందితో ఏర్పాట్ల గురించి సమీక్షించారు. శిబిరానికి రెండు వేల మందిదాకా ఉపాధ్యాయులు వచ్చే అవకాశం ఉందని డీఈఓ తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

17వ రోజుకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె

కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం విధులను బహిష్కరించి 17రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కార్మికులు, యూనియన్ నాయకులు బైక్‌ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. స్థానిక క్లాక్‌టవర్ నుంచి ప్రారంభించిన బైక్ ర్యాలీ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కార్మికులు తిరిగి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి నిరసన కొనసాగించారు. కొందరు యూనియన్ నాయకులు కార్యాలయంలోకి వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు విధులను బహిష్కరించి సమ్మెకు దిగాల్సిరావడం బాధాకరమని అన్నారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా.. సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికుల బకాయి వేతనం మంజూరు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము జమ చేసేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, వివిధ వామపక్ష సంఘాల నాయకులు రాజారెడ్డి, ఏసురత్నం, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రాయుడు, కృష్ణమూర్తి, నాగమణి, రామాంజనేయులు, ఎర్రిస్వామి, రాము, వన్నూరప్ప, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

పలువురు న్యాయాధికారుల బదిలీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో పలువురు న్యాయాధికారులు బదిలీ అయ్యారు. అనంతపురం సివిల్ న్యాయాధికారి ప్రతిభను కడప జిల్లా ప్రొద్దుటూరుకు, మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్‌కుమార్‌ను గుంటూరు జిల్లా సత్తెనపల్లి అదనపు సివిల్ న్యాయాధికారిగా, పెనుకొండ సివిల్ న్యాయాధికారి రమ్యసాయిని చిత్తూరు జిల్లా పుత్తూరుకు, హిందూపురం సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మిని పశ్చిమగోదావరి జిల్లా నరసాపూర్‌కు, కదిరి సివిల్ న్యాయాధికారి ప్రతిమను కర్నూలు జిల్లా డోన్‌కు, కదిరి సివిల్ న్యాయాధికారి మీనాక్షి సుందరిని నెల్లూరు జిల్లా గూడూరుకు, కళ్యాణదుర్గం సివిల్ న్యాయాధికారి సుభాన్‌ను చిత్తూరు జిల్లా మదనపల్లెకు, తాడిపత్రి సివిల్ న్యాయాధికారి క్రిష్ణవేణిని పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు, పెనుకొండ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్‌ను పుట్టపర్తికి, పుట్టపర్తి సివిల్ న్యాయాధికారి రాకేష్‌ను పెనుకొండకు బదిలీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు సివిల్ న్యాయాధికారి భాను రాయదుర్గానికి, కడప సివిల్ న్యాయాధికారి నందిని పెనుకొండకు, కడప జిల్లా ప్రొద్దుటూరు సివిల్ న్యాయాధికారి అనిల్‌కుమార్ గుంతకల్లుకు, నెల్లూరు జిల్లా గూడూరు సివిల్ న్యాయాధికారి లోకనాథమ్ కదిరికి బదిలీ అయ్యారు.

డైట్ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బుక్కపట్నం డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి మే 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ మాత్రమే నమోదు చేసుకోవాలని, ప్రత్యక్షంగా స్వీకరించబోమన్నారు.

అస్తమయం



హిందూపురం

ఎస్‌డీజీఎస్ కళాశాల క్రీడా మైదానంలో పచ్చని కానుగచెట్టు అది. సమయం మంగళవారం సాయంత్రం 5.40 అవుతోంది. ఓ తొండ ఆ చెట్టుపై సేదదీరుతోంది. నిశ్శబ్దంగా ముంచుకొస్తున్న మృత్యువును అది గమనించలేదు. అదే చెట్టుపై దాగి ఉన్న పసురు పాము నెమ్మదిగా తొండ వైపు వెళ్లి.. అమాంతం దాని గొంతు పట్టుకుంది. విడిపించుకునేందుకు గంటకు పైగా తొండ పోరాడింది. దాని సత్తువ సన్నగిల్లేదాకా పాము ఓపికగా, పట్టు సడలకుండా చూసుకుంది. పడమటి ఆకాశం నుంచి అంతసేపూ చోద్యం చూసిన సూరీడు.. సాయంత్రం 6.34 గంటలకు విధి నిర్వహణ ముగించి విశ్రాంతిలోకి వెళ్లిపోయాడు. చీకట్లు కమ్ముకునే వేళ.. కొన ఊపిరితో ఉన్న తొండను నెమ్మదిగా మింగేయడం ప్రారంభించిది పాము. వాకింగ్‌కు వచ్చినవారు ఆ పని మానేసి.. పచ్చని చెట్టుపై ప్రకృతి ధర్మాన్ని కళ్లారా చూసి.. వేదనాభరిత హృదయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం



సత్యసాయి శతజయంతికి ముందస్తు ఏర్పాట్లు

వెంటనే పనులు ప్రారంభించాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ టీఎస్ చేతన్


అధికారుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది నవంబరులో నిర్వహించే సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు అన్నిశాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి శతజయంతి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతికి ప్రధాని నరేంద్రమోదీతోపాటు, దేశవిదేశాలకు చెందిన అనేకమంది ప్రముఖులు పుట్టపర్తి రానున్నట్లు తెలిపారు. పది లక్షల మందికిపైగా భక్తులు వేడుకలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రముఖులకు అవసరమైన ప్రత్యేక హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని, భద్రతాపరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక బస్ స్టేషన్లు, వసతి గృహాలు, మొబైల్ మరుదొడ్లకు ఇప్పటి నుంచే పనులు మొదలుపెట్టాలని అన్నారు. చిత్రావతి నది సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు చలం, రోమాల్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమత, దేవదాయ, పోలీస్, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమతత్వం అనంతం

ప్రపంచానికి అందించండి

సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే

రేపు సత్యసాయి ఆరాధనోత్సవాలు


ప్రసంగిస్తున్న నిమీష్‌పాండే

పుట్టపర్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా ప్రేమతత్వం అనంతమైనదని, దానిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత సాయియూత్‌దేనని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో సత్యసాయిసేవల ప్రచారంపై రెండు రోజులు సదస్సును చేపట్టారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమీష్‌పాండే మాట్లాడుతూ.. సత్యసాయిబాబా ప్రేమతత్వమనే మిషన్‌ను ప్రారంభించారని, దానిని సాయియూత్ విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువతకు ప్రశాంతత కొరవడిందన్నారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, పదవులు అధిష్ఠించినా ప్రశాంతత, విలువలు లేకపోతే ఆ జీవితం వ్యర్థం అన్నారు. అనంతరం మలేషియా ప్రతినిధి జగదీశ్ ప్రసంగించారు. గురువారం నిర్వహించే సత్యసాయి ఆరాధనోత్సవాలకు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 10గంటలకు సత్యసాయి హిల్‌వ్యూస్టేడియంలో భక్తులకు వస్త్రదానం, నారాయణసేవ అందించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సేవాదళ్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సేవాదళ్ ప్రతినిధులు లక్ష్మణరావు, చలం పాల్గొన్నారు.

నాటుసారాను నియంత్రించండి

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


సమీక్ష నిర్వహిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారాను నియంత్రించాలని, అమ్మకందారులపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తిలోని ఆ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ ఎస్ఐలు, సీఐలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏ, బీ, సీ గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకందారులపై నిఘా పెంచాలని, పాత నేరస్థులు, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. నాటు సారా కేసుల్లో పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా చెల్లించేలా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు ప్రతిపాదించాలని అన్నారు. మద్యం షాపుల్లో నిబంధనలు ప్రకారం అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, సూపరింటెండెంట్ నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కా బతకాలి: డీఎఫ్‌ఓ


పామిడిలో మొక్కలను పరిశీలిస్తున్న విఘ్నేష్

పామిడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలో నాటే ప్రతి మొక్క బతకాలని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) విఘ్నేష్ పేర్కొన్నారు. స్థానిక అటవీశాఖ విశ్రాంతి భవనం వద్ద ఉన్న నర్సరీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏయే రకమైన మొక్కలు ఉన్నాయని ఆరా తీశారు. వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేంజర్ మధుబాబు, డిప్యూటీ రేంజర్ దీప, బీట్ ఆఫీసర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) పరీక్షల ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనిత మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 33 మంది విద్యార్థులు హాజరుకాగా 29 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల నిర్వాహక విభాగాధికారులు ప్రొఫెసర్ జీవీ రమణ, డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ అనిత

విద్యుదాఘాతంతో రైతు మృతి

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన రైతు బోయ మాలింగ(35) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు పొలంలో పంటకు నీరు పెట్టేందుకు మోటార్ వద్దకు మాలింగ వెళ్లాడు. మోటారు రివర్స్ ఆడుతుండటంతో స్టార్టర్‌లో కరెంటు వైర్లు మార్చి మోటారు ఆన్ చేయగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చుట్టుపక్కల రైతులు గమనించి వెళ్లేసరికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,810 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాను సోలార్ హబ్‌గా మార్చొద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాను సోలార్ హబ్‌గా మారిస్తే పంట పొలాలు కాంక్రీటు, సోలార్ ప్యానళ్లమయంగా మారి రైతులు నష్టపోతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మడకశిర పర్యటనకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉమ్మడి జిల్లాను సోలార్‌హబ్‌గా మారుస్తామంటూ ప్రకటించడంపై సందేహాలను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి జిల్లాను హార్టికల్చర్‌హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ఎంపీ రంగయ్య ఉమ్మడి జిల్లాలో పండ్ల ఎగుమతికి కిసాన్ రైళ్లను ఏర్పాటు చేయించారని.. ప్రస్తుత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అవసరమైతే కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కుప్పంకు నీటిని తీసుకెళ్లడానికే హంద్రీనీవాకు లైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అదే జరిగితే కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీశ్

రైతులకు చేదోడుగా మహిళా సంఘాలు

పంట దిగుబడి, గిట్టుబాట ధర కల్పించడమే లక్ష్యం

డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి, గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా స్వయం సహాయక మహిళా సంఘాలు రైతన్నలకు చేదోడుగా నిలుస్తాయని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సమీకృత వ్యవసాయంపై స్వయం సహాయక మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి, నష్టనివారణకు సమీకృత వ్యవసాయాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయడం శుభపరిణామం అన్నారు. జిల్లాలో ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల, గుత్తి మండలం జక్కలచెరువును సమీకృత వ్యవసాయానికి పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసిందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేద్యంలో సాంకేతికతను జోడించడం, బహుపంటల విధానం, దిగుబడి పెంచడం, పెట్టుబడిని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి చైతన్యం చేయడానికి స్వయం సహాయక సంఘాల మహిళలను సీఆర్‌పీలుగా ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం జిల్లా సమాఖ్య సమావేశంలో.. స్వయం సహాయక మహిళా సంఘాల సంస్థాగత నిర్మాణం, ఆర్థిక లావాదేవీల నిర్వహణ అత్యంత పారదర్శకంగా, రికార్డుల రూపంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగాధర్, సత్యనారాయణ, ఏపీఎంలు అనిత, శివయ్య, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సుశీలమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

లైనింగ్ పనులు నిలిపివేయాలి

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి

అఖిలభారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం


హంద్రీనీవా ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నిలిపివేసి...వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని అఖిలభారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగముత్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం జలవనరుల శాఖ కార్యాలయంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగముత్యాలు మాట్లాడుతూ.. రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం జిల్లా కరువుతో సహవాసం చేస్తోందని అన్నారు. రైతులు వేల అడుగులు బోర్లు వేసినా నీటి జాడ కనపడక అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక, పంటలు పండక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కరువు నుంచి విముక్తి కల్పించడానికి ఉన్న ఏకైక మార్గం హంద్రీనీవా కాలువ అన్నారు. ఈ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేస్తే భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లైనింగ్ పనులు నిలుపుదల చేసి, వెంటనే వెడల్పు పనులు ప్రారంభించాలని కోరారు. కాలవ పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి పండ్లతోటలను సాగుచేస్తున్న రైతులకు లైనింగ్‌తో తీవ్రనష్టం జరుగుతుందన్నారు. దీనికి ఎస్ఈ స్పందిస్తూ ఇది ప్రభుత్వ నిర్ణయమని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాదని...ఇంకా మేలు జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన ఎస్కేయూ అధికారులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల ఏర్పాటు, హాల్‌టికెట్ల జారీ, ఇన్విజిలేటర్ల కేటాయింపు, జవాబు పత్రాలను కేంద్రాలకు తరలింపు ఇలా అన్ని ప్రక్రియలను సకాలంలో పూర్తిచేశామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ వివరించారు. డిగ్రీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీతోపాటు ఆరో సెమిస్టర్, మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 58 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. మెగా సప్లిమెంటరీ విద్యార్థులు వారి హాల్‌టికెట్స్‌ను కళాశాలలో తీసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి రాగుల కొనుగోలు: జేసీ

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి రాగులు కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో సాగుచేసిన రైతుల నుంచి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా క్వింటా రూ.4,290 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు రాగులు తీసుకురావాలని పేర్కొన్నారు. రాగి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి విక్రయించుకోవాలన్నారు. రైతులకు లోడింగ్, రవాణా చార్జీలు, గోనె సంచుల ఖర్చు కూడా ప్రభుత్వం భరిస్తుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి



తంగేడుకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని తంగేడుకుంట, బలిజపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకల చలమయ్య, గౌస్ లాజం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వ పాఠశాలలో చదివితే కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు.

కార్మిక చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఉమ్మడి జిల్లా లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ కార్మికులకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి కార్మికుడు ఈ చట్టాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇన్‌చార్జ్ లేబర్ ఆఫీసర్ నరేశ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సమాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, సుబ్బయ్య పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు: ఎస్పీ



డ్రోన్ సాయంతో అల్లరి మూకలపై నిఘా

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా సారించామని ఎస్పీ వీ.రత్న మంగళవారం ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని పెదపల్లిలో లైసెన్సు లేని మూడు ఆటోలు, రెండు బైక్‌లు సీజ్ చేశామన్నారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జేవీవీ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ వీడియో కంటెస్ట్ యురేకా సైన్స్ ఎక్స్‌పోలో స్థానిక గణేశ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు మేఘన, తేజస్విని జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. వారిని ఆ పాఠశాలలో మంగళవారం జేవీవీ నాయకులు, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణరెడ్డి అభినందించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు, ఏపీటీఎఫ్ నాయకులు రవీంద్రారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

తనకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నిరుద్యోగి రమణ గుండెపోటుతో మరణించిన విషయం తెల్సిందే. రమణతో కలిసి 2003 పదో తరగతి చదివిన వారు, ఉపాధ్యాయులు సూరి, వేమనాయణ బాధిత కుటుంబానికి రూ.26 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు.

క్షయ నివారణపై అవగాహన

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని బీడుపల్లిలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ నిర్వహించారు. ముందస్తు వైద్యపరీక్షలతో క్షయవ్యాధి నివారణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు రాధ, అనురాధ, టీబీహెచ్‌వీ రాజేశ్వరి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ నగేష్

పాడి రైతులకు అండగా..

పలు ప్రాంతాల్లో నీటి తొట్టెల నిర్మాణం
పశువుల దాహార్తి తీర్చేలా ప్రభుత్వం చర్యలు
హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, కాపరులు



చౌటకుంటపల్లి వద్ద నిర్మించిన తొట్టి

నల్లమాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు తాగునీరు .. వేసవిలో పాడి రైతులు, పశుకాపర్లను పట్టి పీడించే ప్రధాన సమస్య. ఏ గ్రామంలో చూసినా పశువుల దాహార్తిని తీర్చడానికి పాడిరైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పలు గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించి మూగజీవాల దాహార్తి తీర్చింది. పాడి రైతులు, పశు కాపర్లకు అండగా నిలిచింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో మూగజీవాల దప్పిక తీర్చలేక పాడి రైతులు విలవిల్లాడారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించింది. గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించడానికి చర్యలు తీసుకుంది. శరవేగంగా పనులు చేపట్టింది.

● నిధులు మంజూరు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 62 నీటి తొట్టెలను మంజూరు చేసింది. మండలంలో 14 పంచాయతీలున్నాయి. చారుపల్లి పంచాయతీకి ఐదు నీటి తొటెలు, దొన్నికోట పంచాయతీకి ఒకటి, గోపేపల్లి పంచాయతీకి నాలుగు, కురమాల ఆరు, నల్లమాడ ఎనిమిది, పాత బత్తలపల్లి ఎనిమిది, పుల్లగంపల్లి ఆరు, రెడ్డిపల్లి 11, వంకరకుంట నాలుగు, వేళ్లమద్ది ఒకటి, ఎర్రవంకపల్లి ఆరు, మసకవంకపల్లి రెండు నీటి తొట్టెలు మంజూరైనట్లు ఎపీఓ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఒక నీటి తొటి నిర్మాణానికి రూ. 34,406 నిధులు మంజూరు చేసింది. ఇందుకుగాను మండలానికి రూ.21,33,172 నిధులు మంజూరయ్యాయి. శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టింది. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి.

● వైసీపీ నిర్లక్ష్యం

మండలంలో పాడి ఆవులు తొమ్మిది వేలు, గొర్రెలు, మేకలు రెండులక్షలకు పైగా ఉన్నాయి. మండలంలో 76 గ్రామాలున్నాయి. 50 గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వం పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెలు నిర్మించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అరకొరగా కురిసిన వర్షాలకు కుంటలు, చెరువుల్లోకి నీరు లేక.. ఉన్న నీటి తొట్టెలను నీటితో నింపక పాడి రైతులు, కాపరులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం శరవేగంగా నీటితొట్టెలను నిర్మించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం న్యూస్..

సీసీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న ఉప సర్పంచ్

టీడీపీ మద్దతుదారుడి కుటుంబంపై దాడి

నంబులపూలకుంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో రూ.20 లక్షలతో ఉపాధి పథకం కింద సీసీ రోడ్డు వేస్తున్నారు. అక్కడ తమ పట్టా ఉందని, రోడ్డు వేయరాదంటూ వైసీపీ మద్దతుదారుడు, ఉప సర్పంచ్ శ్రీరాములు అతని కుటుంబ సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. ఈ పనులను ఉద్దేశపూర్వకంగా చేయిస్తున్నారంటూ తెలుగుదేశం మద్దతుదారుడు ఆంజనేయులు, అతని భార్య గర్భవతి అయిన శ్రావణిపై రాత్రి దాడి చేశారు. గాయపడిన వారు కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వలీబాషాను మంగళవారం వివరణ కోరగా.. ఇరువురిని విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి గేటు సమీపంలో ఎగ్ సెంటర్ నిర్వహిస్తున్న ఆనంద్, అతని మిత్రులు హరిప్రసాద్, అరుణ్‌కుమార్, శివప్రసాద్ ఆదివారం రాత్రి కానిస్టేబుల్ విశ్వనాథ్‌పై దాడి చేసిన విషయం తెల్సిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

వ్యక్తి అరెస్టు - రిమాండ్‌కు తరలింపు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడైన అమడగూరు మండలానికి చెందిన పసుపులేటి రమేష్‌ను మండలంలోని కొండకమర్ల ప్రాంతంలో సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు అమడగూరు ఇన్‌ఛార్జీ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. అతనిపై జిల్లాలో అసల్ట్ (దాడి, హింస), చీటింగ్, సోషియల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం.. తదితర వాటిపై పలు కేసులు నమోదైనట్లు చెప్పారు. అతన్ని అరెస్ట్ చేసి.. కదిరి కోర్టుకు హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

నాలుగు టిప్పర్ల సీజ్

ముదిగుబ్బ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు నాలుగు టిప్పర్లను సీజ్ చేశారు. ఉప్పలపాడు నుంచి అధిక లోడుతో కదిరి వైపు వెళ్తున్న రెండు ఇసుక టిప్పర్లను, మరో రెండు కంకర టిప్పర్లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్థసారధినగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్టు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి.. అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడిలో అనంతపురానికి చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

బుక్కపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదిరేబైలు గ్రామ పరిసరాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి.. 400 లీటర్ల బెల్లం ఊటను, 15 లీటర్ల నాటుసారా, 30 కేజీల బెల్లం సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరిపై.. వారికి సహకరించిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు నరసింహులు, నాగభూషణ, సురేష్‌బాబు, ప్రసాద్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కదిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం కుర్లి గ్రామ శివారుల్లో హంద్రీనీవా కాలువ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. వారివద్దఉన్న రూ.11,700 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తను భర్త సుధీర్‌కుమార్, అత్త శారదా, మామ రంగనాయకులు, ఆడపడచు సుధా నిత్యం వేధిస్తున్నారని స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన భువనేశ్వరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ నలుగురిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

ఇరువురిపై ...

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువగేరి రామాలయం వద్ద ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ ఫ్రీఫైర్ గేమ్ ఆడుతున్న తులసీరామ్, గణేశ్ సోమవారం రాత్రి గొడవపడ్డారు. పరస్పరం దాడి చేసుకోని గాయపడ్డారు. మంగళవారం పరస్పర ఫిర్యాదులతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

తులసిరెడ్డిని కలిసిన నాయకులు



తులసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి వేంపల్లి నుంచి ముదిగుబ్బ మీదుగా అనంతపురం వెళుతుండగా.. మండల కాంగ్రెస్ నాయకులు రెం డు జీమాన్ల వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. ఇందులో కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, నిస్సార్ అహ్మద్, ప్రభాకర్, అనీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



హేమానందిని, అచ్యుత భానుప్రకాశ్

ధర్మవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చాటారు. పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన శ్యామల, కేఎస్‌ప్రకాశ్ దంపతుల కుమార్తె హేమానందిని ఎంపీసీ ఇంటర్ ద్వితీయ సంవత్సంలో 990/1000 మార్కులు సాధించింది. అదేవిధంగా కేశవనగర్‌కు చెందిన అచ్యుత శ్రీనివాసులు కుమారుడు భానుప్రకాశ్ ఇంటర్ ఎంఈసీ మొదటి సంవత్సరంలో 495/500 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచాడు.

మా సమస్యలు పట్టించుకోరా..!

విద్యుత్ శాఖ ఏఈని నిలదీసిన మహిళలు



ట్రాన్స్‌కో ఏఈని చుట్టుముట్టిన మహిళలు

కొత్తచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మేదర్‌వీధికిలో కొన్ని నెలలుగా లో ఓల్టేజ్ సమస్య ఉందని, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయని, ఈ సమస్యను పలుమార్లు చెప్పినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదని ఆ ప్రాంత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్‌ను చుట్టుముట్టి.. నిలదీశారు. శుక్రవారం లోపు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ హామీ ఇవ్వడంతో వారు శాంతించి.. వెనుతిరిగారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునెయ్యగౌడ్

ఘనంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

బుక్కపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ మునెయ్య గౌడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీష్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రష్యా విప్లవ నాయకుడు లెనిన్ 155వ జయంతిని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. ఇందులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రాంభూపాల్, నాయకులు లక్ష్మీనారాయణ, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, రఫీ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాదాస్పద రస్తాల పరిశీలన

బత్తలపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మల్లకుంట, చిన్నేకుంటపల్లి, దంపెట్ల, ఉప్పర్లపల్లిలో రస్తా సమస్యలను గతంలో ఆయా గ్రామాల రైతులు.. ఆర్డీఓ మహేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. వివాద రస్తాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సరిహద్దు రైతుల సమ్మతితో రస్తా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వివాద రస్తాలను తహసీల్దార్, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ స్వర్ణలత, సర్వేయర్ జోసఫ్, వీఆర్‌ఓలు ఉన్నారు.



గుమ్మల్లకుంట రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

విశ్రాంత ఉద్యోగికి సన్మానం



మైనోద్దీన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కదిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన మైనోద్దీన్‌ని మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మైనోద్దీన్, ఆయన సతీమణి షమీమ్ ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణ, యూటీఎఫ్ నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్, ఎంఈఓ ఓబులరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, వరప్రసాద్‌రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, షఫీ, డీ శ్రీనివాసులు, తాహేర్‌వలీ, వైవీ సుబ్బారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు త్రిమూర్తి, ఎస్‌టీయూ రామమోహన్, రవినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్ డే



విద్యార్థులతో పాఠశాల యజమాన్యం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్లూమూన్ పాఠశాలలో మంగళవారం ఘనంగా స్కూల్ డేని నిర్వహించారు. క్రీడలు, అకాడమిక్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్, సెక్రటరీ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు సురేంద్రరెడ్డి, ఇన్‌ఛార్జీ మాధవరెడ్డి, పీఈటీ రామాంజులరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

గాండ్లపెంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కేరళ మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ జోసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీవో శ్రీనివాసులు, ఎంఈఓ క్రిష్టానాయక్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రహంతుల్లా, సిద్దారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గాండ్లపెంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. 2025-26నుగాను ఎస్సీకార్పొరేషన్ సబ్సిడీతో స్వయం ఉపాధి కోరకు నిరుద్యోగులకు ఈ రుణాలు ఇస్తోందన్నారు. అర్హులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటసాయి ఐటీఐ కళాశాలలో బుధవారం ఉదయం 10గంటలకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి మంగళవారం తెలిపారు. అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాలకు సంబంధించిన ప్రజలు ఈ వేదిక ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం మూడు గంటలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తారని, సాయంత్రం 5గంటలకు వశిష్ట ఇంగ్లీషు మీడియం పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

తాడిమర్రి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లికార్జునప్ప అన్నారు. మంగళవారం తాడిమర్రి మండలంలోని రామాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నూతన బోరు వేయించగా నీరు పడిందని, అదే విధంగా మిగిలిన గ్రామాల్లో కూడా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఎక్కడైనా తాగునీటిసమస్య అధికంగా ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతమ్మ, ఏఈ షామీద, రామాపురం మాజీ సర్పంచ్ రామ్మోహన్ ఉన్నారు.

కళాశాలలో సౌకర్యాల కల్పన

కొత్తచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హుందాయ్ కార్ల కంపెనీ స్థానిక శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.20 లక్షలతో కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, ఆడిటోరియం నిర్మించింది. వీటిని ఆ కంపెనీ చీఫ్ ప్లానింగ్ అధికారి సైన్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆడిటోరియం, కంప్యూటర్ సైన్స్‌ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో డీఐఈఓ రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్ నిర్మల జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ల అందజేత

నల్లమాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ. 30 వేల విలువైన ఆహుజా స్పీకర్లు, ఆంప్లిఫైర్‌ను ప్రధానోపాధ్యాయుడు జంషీర్‌కు అందచేశారు. మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా పాఠశాలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగరాజు, మోతీలాల్, ఫయాజ్, బషీర్, శ్రీనివాసులు, జయప్ప, ఆంజనేయులు, ప్రకాష్ పాల్గొన్నారు.



స్పీకర్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

న్యూస్ బాక్స్

సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను మే 20న నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నాయకులు బావమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేశులు హాజరై లేబర్‌కోడ్‌కు సంబంధించిన బుక్‌లెట్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలన్నీ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్నవేనన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, అతితక్కువ జీతాలతో పనిచేయడం, పనిభద్రతలేకపోవడం లాంటి సమస్యలతో కార్మిక వర్గం నేటికీ సతమతమవుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం మే 20న నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

- ఏడీఏ కృష్ణమీనన్



రైతు గిరీష్ పొలంలో అధికారులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ కృష్ణమీనన్ సూచించారు. మంగళవారం మడకశిర డివిజన్ పరిధిలో ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించిన 34 మంది రైతుల పంటలను రాష్ట్రసేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధికారి వెంకటేష్ పరిశీలించారు. మండలంలోని ఆర్ అనంతపురం గ్రామంలో రైతు గిరీష్ సాగుచేసిన రాగి పంటను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించడంతో గిరీష్ అధిక దిగుబడులు సాధించారన్నారు.

లెనిన్ బాట నేటి సమాజానికి అవసరం

సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్



నివాళులు అర్పిస్తున్న నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని ఆచరణ ద్వారా నిరూపించిన లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మతోన్మాద రాజకీయాలకు లెనిన్ చూపినబాట చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హరి, బాబావలి, గంగాధర్, మహబూబ్ బాషా, బావమ్మ పాల్గొన్నారు.

మైనార్టీ నాయకుడికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి హుజురుల్లా ఖాన్ తల్లి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆయన గృహానికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని దర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గర్భిణులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న తొగటవీరక్షత్రియులు

సోమందేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తొగటవీరక్షత్రియ సంఘం సభ్యులు అనురాధ, వెంకటేశులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నీసీహరి మాట్లాడుతూ వైద్య పరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి ఆసుపత్రికి వచ్చే బాలింతలు, గర్భిణీలకు తమ సంఘం తరుపున ప్రతినెల అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు ఓంకార్ నేతృత్వంలో భోజనశాలలో వండిన ఆహార పదార్థాలను గర్భిణీలకు వడ్డించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండారు శ్రీనివాసులు, అంజనేయులు, రంగన ఉపేంద్ర, దేవాంగం అంజనేయులు, లింగాలపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలతో బీమా చేయించండి'

అమరాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్ష బీమా, రాష్ట్రీయ స్వస్థ్ బీమాలను ఉపాధి కూలీలతో నమోదు చేయించాలని ఏపీఓ జగదీశ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మే 1వ తేదీలోపు మండలవ్యాప్తంగా కూలీల సంతకాలు తీసుకుని బ్యాంకుల్లో నమోదు చేయించాలన్నారు.

జెండా ఎగరడమే తరువాయి..!

- నగర పంచాయతీలో మారుతున్న రాజకీయం
- టీడీపీకి జైకొట్టిన వైసీపీ కౌన్సిలర్లు
- చైర్మన్‌పై అవిశ్వాసం దిశగా పరిణామాలు



మడకశిర నగర పంచాయతీ కార్యాలయం

మడకశిర టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ త్వరలో టీడీపీ జెండా ఎగిరే అవకాశం కనిపిస్తోంది. మడకశిర నగర పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. అప్పటి ఎన్నికల్లో 5 వార్డులను టీడీపీ, 15 వార్డులను వైసీపీ గెలుచుకుంది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నేతృత్వంలో ఆ ఎన్నికల్లో గట్టి పోటీని ఇచ్చిన టీడీపీ.. నాలుగు స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయింది. రెండు స్థానాలు కేవలం 10 ఓట్ల తేడాతో చేజారాయి. వైసీపీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనరసమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సార్వత్రిక ఎన్నికల తరువాత సీన్ మారిపోయింది. వైసీపీ అధికారం కోల్పోవడం, స్థానికంగా టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో వైసీపీ వార్డు మెంబర్లు పునరాలోచనలో పడ్డారు. నగర పంచాయతీ అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు పలుకున్నారు. వైసీపీలో అంతర్గత పోరు తారస్థాయికి చేరడంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. లక్ష్మీనరసమ్మను దించేసి, 5వ వార్డుకు చెందిన టీడీపీ అభ్యర్థి నరసింహరాజును చైర్మన్‌గా ఎన్నుకుంటారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ కౌన్సిలర్లలో 8 మంది ఇప్పటికే టీడీపీకి జై కొట్టారు. 5వ వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వ వార్డు సుధాకర్ నాయక్, 6వ వార్డు పార్వతమ్మ, 13వ వార్డు సుజాతమ్మ, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వ వార్డు సుభద్ర, 18వ వార్డు సావిత్రమ్మ తదితరులు బహిరంగగానే టీడీపీకి మద్దతు ప్రకటించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు

మంత్రి సవిత



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సవిత అన్నారు. ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, రూ. 18లక్షలతో నిర్మించిన సెక్షన్ ఆఫీస్, కంట్రోల్‌రూమ్, ఏఈఈ కార్యాలయాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెనుకొండలో గతంలో తొలగించిన పోల్‌సెంటర్‌ను రూ.4కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ స్తంభాలను ఇక్కడే తయారయ్యేలా చూస్తామన్నారు. ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ రూ.92కోట్లుతో ప్రతి గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా 24గంటలు ఇచ్చేందుకు పనులు ప్రారంభించామన్నారు. ఆరు నెలల్లో పనులు పూర్తి అవుతాయన్నారు. తద్వారా 90శాతం విద్యుత్ పాత స్తంభాలను తొలగించి, కొత్త లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేస్తామన్నారు. అనంతరం మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ శివరాములు, ఏఈలు బాలక్రిష్ణనాయక్, అప్పారావు, ఎంపీడీఓ నరేంద్రకుమార్, సీఐ శేఖర్, కన్వీనర్ సోముశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేసి సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో సమష్టిగా పనిచేసి సమస్యలు పరిష్కరించాలని మంత్రి సవిత సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రి సవిత, నియోజకవర్గ పరిశీలకులు నరసింహరావుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి మాట్లాడుతూ కమిటీలను త్వరగా పూర్తీచేయాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. రొద్దం మండలానికి చెందిన కలిపి, పెద్దమంతూరు, చిన్నమంతూరు, చెరుకూరు, కల్లూరు, చోళేమర్రి పంచాయతీకి చెందిన నాయకులు సమీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో మాధవనాయుడు, చిన్నప్పయ్య, అరుణ్‌రెడ్డి, టైలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు మండల కన్వీనర్ శ్రీరాములు, సిద్దయ్య తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఓపెన్‌జిమ్ ప్రారంభిస్తారని, 10గంటలకు మండలంలోని మునిమడుగు పంచాయతీ అమ్మవారిపల్లిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 11 గంటలకు కియా మెయిన్‌గేట్ దగ్గర ఏ2బీ హోటల్ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారన్నారు.

'వ్యాపారవేత్తలుగా ఎదగాలి'



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హిందూపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయని ఎస్‌డీజీఎస్ కళాశాల కార్యదర్శి బైసానిరాంప్రసాద్ అన్నారు. మంగళవారం ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఎంబీఏ విభాగం జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్ మాట్లాడుతూ ఎంబీఏ కోర్సును అందిపుచ్చుకుని మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఆధారంగా కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మంచి వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు దాసా సురేష్, రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, డిగ్రీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంబీఏ హెచ్ఓడీ అనీల్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

అగళి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్‌స్కూల్‌లో భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో 6, 7 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధికారి నాగరాజు గుప్తా మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందనీ, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, ప్రిన్సిపాల్ జాఫర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

అగళి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అగళి మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ కోర్సు బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఇంటర్‌షిప్ సర్టిఫికెట్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. పదిరోజులపాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న టెన్త్, 11, 12 తరగతుల విద్యార్థులకు ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ జాఫర్ సర్టిఫికెట్లు అందించారు. ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సువల్ల ఉపాధి, భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యూటీఅండ్ వెల్నెస్ ఒకేషనల్ ఉపాధ్యాయులు నాగరత్న పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో నవోదయ సత్తా


వసంత్‌కుమార్

రేవంత్

మంజునాథ్

మనోజ్‌కుమార్‌రెడ్డి

లేపాక్షి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు జేఈఈ ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో నలుగురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. వసంత్‌కుమార్ 92.16, రేవంత్ 84.98, మంజునాథ్ 67.98, మనోజ్‌కుమార్‌రెడ్డి 88.82 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

ఘనంగా పురందేశ్వరి జన్మదిన వేడుకలు



కేక్‌కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్, గోపీనాథ్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మమత, నాయకులు రామక్రిష్ణ, రామాంజి, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలను అందజేస్తున్న ఎంఈఓ

చిలమత్తూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని ఎంఈఓ సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ఉత్తమంగా తీర్చదిద్దడం కోసం వారికి అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రధానంగా రొలేటర్, హియరింగ్ ఎయిడ్స్, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ అందజేస్తుందన్నారు. ఈ ఉపకరణాలతో దివ్యాంగ విద్యార్థులు తమ ప్రతిభను చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఆర్పీలు ప్రభావతి, శమంతకమణి, గోవిందమ్మ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ

అమరాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలస గ్రామంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పట్టుపరిశ్రమశాఖల ఆధ్వర్యంలో గ్రామంలోని పురవీధులగుండా ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. రైతులు సేంద్రీయ ఎరువులు మాత్రమే వాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగుసీసీలు భాస్కర్, నాగరాజు, దేవీరమ్మ, లక్ష్మీనరసప్ప, వీఏఓలు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

- మున్సిపల్ చైర్మన్



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్, చైర్మన్

హిందూపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ రమేష్ సూచించారు. మంగళవారం శ్రీకంఠపురంలోని మురుగుకాలువను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మురుగు కాలువల్లోకి వ్యర్థాలు, పాత ఇళ్ల తొలగించిన మట్టిని వేయడంవల్లమురుగునీరు ఎక్కడికక్కడే ఆగిపోతోందని, దీనివల్ల అపరిశుభ్రత నెలకొంటోందన్నారు. దీంతోపాటు శ్రీకంఠపురం చెరువు నిండి మరువనీరు ఇళ్లలోకి వస్తున్నాయని, సమస్యపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపం శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ యోగానంద్, కౌన్సిలర్ గిరీష్, చెరువు సంఘం అధ్యక్షులు వెంకటేష్, ఎంహెచ్ఓ శోభన్‌రెడ్డి, ఈఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

పరికరాల పరిశీలన

హిందూపురం మున్సిపాలిటీకి ఏడీసీ గ్రాంట్ కింద మంజూరైన రూ.2కోట్ల నిధులతో నీటి సరఫరా విభాగం పైప్‌లైన్ పరికరాలను చైర్మన్ రమేష్ పరిశీలించారు. వారంలోపు మరింత సామగ్రి వస్తుందన్నారు. అదేవిధంగా పట్టణానికి 850వీధి బల్బులు వస్తున్నాయన్నారు. పట్టణంలో నీటి పైపు లీకేజీ నియంత్రణకు ఈ పరికరాలు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

హిందూపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు జాబ్ మేళ సువర్ణావకాశమని చైర్మన్ రమేష్ అన్నారు. పట్టణంలోని బాలాజీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మాట్లాడుతూ.. స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 22 కంపెనీలు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు మేళాలో పాల్గొని 200మందికిపైగా యువతీ యువకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి హరీ, బాలాజీ, ప్రిన్సిపాల్ వీరభద్రప్ప పాల్గొన్నారు.

వైభవంగా వడిసిలమ్మ దేవత ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న గుండమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామంలో వడిసిలమ్మ, గౌడుసంద్ర మారెమ్మ దేవతల ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవార్లకు ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో హరేసముద్రం, భక్తరహళ్లి, వైబీ హళ్లి, జిల్లేడగుంట, క్యాంపురం, ఉపార్లపల్లి గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు.. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● మహిళల డిమాండ్ ● ఖాళీ బిందెలతో నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిబండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. మంగళవారం మండలంలోని జమ్మలబండ గ్రామంలోని మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధితశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో వారు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించి తాగునీటిని తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నామన్నారు. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అధికారులు వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు మాటలు నమ్మవద్దు : ఉషశ్రీ



నాయకులతో మాజీ మంత్రి ఉషశ్రీ

సోమందేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నమ్మవద్దని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జూలకుంట గ్రామంలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం పచ్చి అబద్ధాలకోరని, మాటలను ప్రజలు నమ్మి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.